నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- మంత్రి ధనసరి అనసూయ
- సమీకృత కలెక్టరేట్, మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పరిశీలన

మెడికల్ కళాశాల సరిసరాలను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ములుగురూరల్, జూన్ 29 : సమీకృత కలెక్టరేట్, మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె కలెక్టర్ టీఎస్ దివాకర్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించి నిర్ణీత గడువులోగా భవనాలను అందించాలన్నారు. అవసరమైతే అదనపు కార్మికులను నియమించుకొని నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కలెక్టరేట్ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేసి అధికారులకు అందించాలని ఆదేశించారు. ఎన్‌హెచ్ నుంచి కలెక్టరేట్ వరకు వచ్చే రహదారి పనులు, మెడికల్ కాలేజీలో మిగిలి ఉన్న పనులు పూర్తి చేయాలని అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో మెడికల్ కాలేజీ ప్రారంభానికి కావాల్సిన సదుపాయాలను, ఇతర అంశాలను ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్‌ను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా కాలేజీకి కావాల్సిన అనుమతులను ఇప్పించేందుకు కృషి చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేష్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బానోత్ రవిచందర్, వంగ రవియాదవ్, రేవంత్‌యాదవ్ పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను వారంలో పరిష్కరించాలి

కలెక్టర్లతో వీసీలో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, జూన్ 29 : పెండింగ్‌లోని ధరణి దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. శనివారం పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం, స్వభావంపై కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జిల్లాల్లో ఎక్కువ రోజుల నుంచి తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో 14 రకాల అంశాలతో కూడిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని 12 మండలాల్లో వివిధ కారణాల వల్ల 1,826 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. సమీకృత గురుకుల పాఠశాల కాంప్లెక్స్ కోసం గణపురం మండలం మైలారం శివారులో 40 ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సక్సేషన్ కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం వారసులకు నోటీసులు జారీ చేయాలని, ఎలాంటి అభ్యంతరం లేదని ధ్రువీకరణ తీసుకున్న తర్వాతే సక్సేషన్ చేయాలని సూచించారు. వరదల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. సోమవారం వరకు మండల స్థాయి వరద ప్రణాళిక నివేదికలు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, తహసీల్దార్లు, ఈడీఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

జిల్లా గణాంక దర్శిని పుస్తకం ఆవిష్కరణ

గణాంకాల పితామహుడు ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతిని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో ముఖ్య ప్రణాళికా శాఖ తయారు చేసిన జిల్లా గణాంక దర్శిని పుస్తకాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ ఆవిష్కరించారు.

సైబర్ నేరాలపై పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు

ములుగురూరల్, జూన్ 29 : సైబర్ నేరాలపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలకు రూపొందించిన సైబర్ హైజీన్ పోస్టర్లను ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వీటిని ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలు, ఇతర ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సందీప్‌రెడ్డి, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు శంకర్, యాసిన్, ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు సన్మానం

సీఐ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఏటూరునాగారం, జూన్ 29 : ఏఎస్పీ మహేశ్ గీతే, ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావుతో పాటు నాయకులు శనివారం వారిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, నాయకులు తాటి కృష్ణ, వలీబాబా, కాకులమర్రి ప్రదీప్‌రావు, తాడూరి రఘు, దన్నపునేని కిరణ్, కుమ్మరి చంద్రబాబు, కాకులమర్రి భాస్కర్‌రావు, లొటపెట్టల రాజేశ్, జాడి భోజారావు, కాళ్ల రామకృష్ణ, గద్దె జయకృష్ణ, గుజ్జేటి రాజు, గండపెల్లి నర్సయ్య, తాళ్లపల్లి మోహన్, పాలకుర్తి శ్రీనివాస్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

NAMASTHE TELANGANA CLASSIFIEDS

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

RENT/ LEASE

★కమర్షియల్ బిల్డింగ్ Rent/ Lease కు ఇవ్వబడును. హనుమకొండలోని అలాంకర్ జంక్షన్ శరత్ హాస్పిటల్ లేన్‌లో HP Gas ప్రక్కన G+4, Each Flore 1550 Sq.Ft with కమర్షియల్ లిఫ్ట్. సంప్ర: 9440505062.
NTW-00

WANTED TEACHERS

★Wanted Teachers to teach 3rd to 6th Classes Social and 4th to 8th Classes Computers. VIGNAN HIGH SCHOOL, Dharmaram, Cell: 9441997597, 8341599333.
NTW-6504

HEALTH CARE

★ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం||ల సేవలు అందించబడును. సంప్ర|| 6281476205, 9440325526
KMM_11679

WANTED

jobs Apply Now!

★Wanted Pharmacy Manager, Pharmacists, HR Manager (with Hosp Exp), PRE, Front Office Executives, Financial counsellor, Floor Manager, Nursing staff, (GNM B.sc Nur) for a reputed Hospital. Cont.: 7337313271, 9949499959.
NTW-14482

★Corel Draw, Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639

CHANGE OF NAME

★I, SHARMIN SHAMSHUDDIN DHANANI, R/o. 8-9-183, Polavari street, Sadashiva Nilayam, Warangal, Telangana. Changed My Name as SHARMIN DHANANI.
NT-327672

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565

గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ అదృష్టం

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, జూన్ 29 : ప్రజల కోసం అహర్నిశలు పనిచేసి గౌరవ ప్రదంగా ఉద్యోగ విరమణ పొందడం అదృష్టమని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం ఎస్సై ప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించగా ఎస్పీ హాజరై ఎస్సైను సత్కరించి, వీడ్కోలు పలికారు. ఉద్యోగ విరమణ అనంతరం ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని ఎస్సైకి సూచించారు. కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, రత్నం పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

మహదేవపూర్, జూన్ 29 : మండలానికి చెందిన ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన పెంట రామన్న (75) మతిస్థిమితం లేక ఈ నెల 28న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామానికి చెందిన జాడి రాజేందర్ కొత్త చెరువు గుండా వెళ్తుతండా ఒడ్డున పెంట రామన్న చెప్పులు కనిపించాయి. వెంటనే కుటుంబ సభ్యులను సమాచారం ఇవ్వగా వారు చెరువులో గాలించగా మృతదేహం లభించింది. మృతుడి కుమారుడు పెంట స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.4లక్షల గంజాయి స్వాధీనం

ఏటూరునాగారం, జూన్ 29 : మండలకేంద్రంలోని అటవీశాఖ చెక్ పోస్టు వద్ద ఎస్సై తాజొద్దీన్ ఆధ్వర్యంలో రూ. 4లక్షల విలువ చేసే 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ మహేశ్ గీతే తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ర్టానికి చెందిన పిల్లం వీర్రాజు టాటా మ్యాజిక్‌లో వస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు తేలడంతో శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ రామారావు, కానిస్టేబుల్స్ గోపి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

వాజేడు, జూన్ 29 : అధిక ఇసుక లోడుతో వెళ్తున్న లారీని శనివారం పోలీసులు పట్టుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. ఎస్సై హరీశ్ కథనం ప్రకారం.. గుమ్మడిదొడ్డి శివారులోని 163 జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అతివేగంతో అదనపు ఇసుకలోడ్‌తో వెళ్తున్న లారీని వెంబడించి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు డ్రైవర్ శ్యామకూర మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు

గోవిందరావుపేట, జూన్ 29 : అపరిచిత వ్యక్తులకు గొత్తికోయలు ఆశ్రయం కల్పించొద్దని పస్రా ఎస్సై కమలాకర్ సూచించారు. మండల పరిధిలోని పస్రా పీహెచ్‌సీ పరిధి దేవునిగుట్ట గొత్తికోయగూడేన్ని శనివారం ఆయన సందర్శించి, మాట్లాడారు. కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని, ఎవరైనా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. గూడేల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

మల్లూరు ఆలయ భూముల కౌలు వేలం పాట

మంగపేట, జూన్ 29 : మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థాన వ్యవసాయ భూములు ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి, తాడ్వాయి మండలం కాటాపురం శివారు ఉప్పుకుంట సమీపంలో ఉండగా, ఆ గ్రామ పంచాయతీల వద్ద శనివారం దేవస్థాన సిబ్బంది కౌలు వేలం పాట నిర్వహించారు. శంకరాజుపల్లి శివారులోని 1.28 ఎకరాల పొలానికి రూ.18,600, కాటాపురం శివారులోని 26.05 ఎకరాల పొలానికి రూ.26వేలు కౌలు వేలం ద్వారా వసూలైనట్లు ఇన్‌చార్జి ఈవో మహేశ్ తెలిపారు. కౌలు హక్కులు దక్కించుకున్న రైతులు ఈ ఏడాది జూలై 1 నుంచి 2025 మే 31 వరకు పంటలు సాగు చేసుకోవచ్చని ఈవో సూచించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ మండల అధ్యక్షుడిగా శివకుమార్

ఏటూరునాగారం, జూన్ 29 : జాతీయ మానవ హక్కుల కమిటీ ఏటూరునాగారం మండల కమిటీ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గంపల శివకుమార్‌ను రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు తెలిపారు. ఈ సందర్భంగా తనను నియ మించిన నాయకులకు శివకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

జీవనోపాధి అవకాశాలను గుర్తించాలి

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, జూన్ 29 : గ్రామాల్లోని సమస్యల పరిష్కారంతో పాటు జీవనోపాధి కల్పించే అవకాశాలను గుర్తించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి తాడ్వాయి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో వనరులు, సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఎన్ని విధాలుగా జీవనోపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయో చూడాలన్నారు. స్థానిక యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం తదితర అంశాలపై సర్వే చేయాలని ఆదేశించారు. మహిళలకు జీవనోపాధి, కుటీర పరిశ్రమల ఏర్పాటు అవశ్యకతను తెలియజేయాలన్నారు. రైతులు ఎక్కువగా ఎలాంటి పంటలు పండిస్తున్నారు..? దిగుండి ఎంత వస్తుందని..? నూతన వంగడాలను సాగు చేస్తే రైతులకు మేలు జరుగుతుందా..? అనే అంశాలను కూడా నమోదు చేసుకోవాలని అన్నారు.

ఏకరూప దుస్తులను సిద్ధం చేయాలి

అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు అందించే ఏకరూప దుస్తులను జూలై 5 వరకు సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ అధికారులను కలెక్టర్ టీఎస్ దివాకర ఆదేశించారు. శనివారం ఆయన పాల్‌సాబ్‌పల్లిలో మహిళా సంఘాల సభ్యులు కుడుతున్న యూనిఫాంలను పరిశీలించారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు దుస్తుల తయారీని సంఘాలకు అందించినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, డీపీఎం, ఏపీఎం ఉన్నారు.

కుసుమ జగదీశ్వర్‌కు గండ్ర దంపతుల నివాళి

నివాళులర్పిస్తున్న గండ్ర దంపతులు

కృష్ణకాలనీ/గోవిందరావుపేట, జూన్ 29 : ములుగు దివంగత జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్‌కు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి శనివారం మల్లంపల్లిలోని ఆయన నివాసంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు జగదీశ్ చిత్రటానికి పూలమాల వేశారు. అలాగే, జగదీశ్వర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా గోవిందరావుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని జగదీశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేసీఆర్ నిర్ణయంతో ములుగు జడ్పీ చైర్మన్‌గా ఎన్నికై ప్రజా సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి జగదీశ్వర్ అని కొనియడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి లకావత్ నర్సింహనాయక్, రైతు బంధు మండల కన్వీనర్ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు అకినేపల్లి రమేశ్, బాబర్, పృథ్వీరాజ్, హేమాద్రి, పూర్ణచందర్, మధు, మోహన్, రాణి, ఒడేలు పాల్గొన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే కేసులు పెట్టాలి

భూపాలపల్లి జడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ కళ్లెపు శోభా రఘుపతిరావు

కృష్ణకాలనీ, జూన్ 29 : జిల్లాలోని వైన్ షాపు యజమానులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొని, వారిపై కేసులు నమోదు చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభా రఘుపతిరావు ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జడీ వైస్ చైర్‌పర్సన్ అధ్యక్షతన ఏడు స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆయా శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తన శాఖపై వివరిస్తుండగా టేకుమట్ల, చిట్యాల మండలాల జడ్పీటీసీలు పులి తిరుపతిరెడ్డి, గొర్రె సాగర్ మధ్యలో కలుగజేసుకొని మాట్లాడారు. టేకుమట్లలో ఒక్కటి, వెలిశాలలో ఒక మద్యం షాపు కేటాయించారని, కానీ, నిబంధనలకు విరుద్ధంగా వారు రెండు షాపులను మండలకేంద్రంలో పక్కపక్కన ఏర్పాటు చేశారన్నారు. అంతేకాకుండా ఒక షాపులో రిటైల్, మరో షాపులో బెల్ట్ షాపులకు మాత్రమే అధిక ధరలకు అమ్ముతున్నారని తెలిపారు. ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇదే జరుగుతున్నదని, అధికారులు మామూళ్లు తీసుకొని పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయన్నారు. అనంతరం జడ్పీ వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు తనిఖీలు నిర్వహించి అధిక ధరలు, బెల్టు షాపులకు మద్యం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచేలా వ్యవసాయ శాఖ అధికారులు చూడాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏకరూప దుస్తులు త్వరగా ప్రభుత్వ పాఠశాలల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

జాతీయ గణాంకాల దినోత్సవం

ములుగురూరల్, జూన్ 29 : పత్తిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడు సుతారి మురళీధర్ నేతృత్వంలో జాతీయ గణాంకాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణాంకాల పితామహుడు ప్రశాంత చంద్ర మహలనోబిస్ చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజిత, శివరామ్, నర్సింహాచారి, రవి, స్వామి, శ్రీనివాస్, రజనీకాంత్, వెంకటయ్య పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

వెంకటాపురం (నూగూరు), జూన్ 29 : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, దామోదర్‌రెడ్డి, చంద్రశేకర్, విజయలక్ష్మి, భూషణం, సుందర్‌రావు పాల్గొన్నారు.

నీట్‌ను మళ్లీ నిర్వహించాలి

భూపాలపల్లి రూరల్, జూన్ 29 : ఎన్‌టీఏను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూపాలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ నీట్, నెట్ పరీక్షల అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలన్నారు. బీజేపీ అమలు చేస్తున్న కేంద్రీకృత విద్యావిధానంతో అసమానతలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, శివ, చందు, ప్రవీణ్ పాల్గొన్నారు.

కేసీఆర్ ఇచ్చినట్టే రైతుబంధు ఇవ్వాలి

అభిప్రాయ సేకరణలో అన్నదాతలు


వాజేడు : మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సర్దార్‌సింగ్

వాజేడు, జూన్ 28 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చినట్టే రైతుబంధు ఇవ్వాలని రైతులు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుభరోసా పథకం అమలుపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమానికి హాజరైన మెజార్టీ రైతులు గత ప్రభుత్వం అమలు చేసినట్టే ఇవ్వాలని అధికారులకు సూచించారు. కొందరు పది ఎకరాల్లోపు అని, మరికొందరు కౌలు రైతులకు సైతం ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతుల అభిప్రాయాలు ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి (డీసీవో) సర్దార్‌సింగ్, ఏటూరునాగారం ఏవో వేణుగోపాల్, ఏఈవోలు జాఫర్, రాధిక, పీఏసీఎస్ అధ్యక్షుడు యగ్గడి అంజయ్య, సొసైటీ సీఈవో సోమ సత్యనారాయణ పాల్గొన్నారు.

వెంకటాపురం (నూగూరు)లో..

వెంకటాపురం (నూగూరు) : మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో రైతు భరోసా పథకంపై పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలను సేకరించారు. సుమారు 150 మంది రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. పది ఎకరాల్లోపు రైతులకు రైతు భరోసా వర్తింపజేయ్యాలని, రైతు బంధు డబ్బులు రెట్టింపు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఏవో విజయ్‌చంద్ర, డీసీవో కార్యాలయం అధికారి చంద్రశేఖర్, ఏఈవో శ్యాంసుందర్, సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, సిబ్బంది తోటపూర్ణ పాల్గొన్నారు.

రుణమాఫీపై ప్రజాభిప్రాయ సేకరణ

భూపాలపల్లి రూరల్ : రైతు రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నదని భూపాలపల్లి డీఏవో విజయభాస్కర్ తెలిపారు. ఇందులో భాగంగా పీఏసీఎస్‌లోని సభ్యులు, రైతులు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి వారి అభిప్రాయాలు సేకరించనున్నట్లు చెప్పారు. జూలై 1న ఉదయం 11 గంటలకు గణపురం పీఏసీఎస్, మధ్యాహ్నం 2.30 గంటలకు రేగొండ, జంగేడు పీఏసీఎస్‌లు, జూలై 2న ఉదయం 11 గంటలకు మహదేవపూర్, గారేపల్లి పీఏసీఎస్‌లు, మధ్యాహ్నం 2.30 గంటలకు మొగుళ్లపల్లి, మహాముత్తారం పీఏసీఎస్‌లు, జూలై 3న ఉదయం 11 గంటలకు చిట్యాల, తాడిచర్ల పీఏసీఎస్‌ల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు, రైతులు, ప్రజా ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు తెలుపాలని ఆయన కోరారు.

పస్రాలో పాల బిల్లులు చెల్లించాలని రాస్తారోకో చేస్తున్న రైతులు

పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలి

- గత సీఎం కేసీఆర్ ఇచ్చిన బోనస్‌ను అమలు చేయాలి
- పస్రాలో పాల ఉత్పత్తి దారుల రాస్తారోకో

గోవిందరావుపేట, జూన్ 29 : విజయ డెయిరీకి పాలు పోసి రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వం నేటికీ బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ పస్రా జాతీయ రహదారిపై శనివారం పాల ఉత్పత్తిదారులు రాస్తారోకో నిర్వహించారు. సంఘం నాయకుడు సూరపనేని వెంకటసురేశ్ ఆధ్వర్యంలో గోవిందరావుపేట, తాడ్వాయి మండలాలకు చెందిన పాల ఉత్పత్తిదారులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటసురేశ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాల ఉత్పత్తిదారులు రైతులకు ప్రభుత్వ ధర కంటే ఎక్కువ చెల్లిస్తున్నా పట్టించుకోకుండా, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న విజయ డెయిరీకి విక్రయిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించేవారని, పాల ఉత్పత్తిదారుల బాధలను చూసి లీటరుకు రూ.4ను బోనస్ ప్రకటించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలలు కావొస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. వెంటనే పెండింగ్ బిల్లులతోపాటు బోనస్‌ఇవ్వాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాస్తారోకోతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న ఎస్సై కమలాకర్ రైతులకు నచ్చజెప్పి విరమింపజేశారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన ఉండాలి

తాడ్వాయి, జూన్ 29 : ప్రకృతి వైపరీత్యాలపై అందరికీ అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేక అధికారి, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య అన్నారు. శనివారం ఎంపీడీవో సుమనవాణి అధ్యక్షతన మేడారం పరిసర గ్రామాల ప్రజలతో ప్రకృతి వైపరీత్యాలు, రక్షించుకోవడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరదలు వచ్చినప్పుడు ఎలా రక్షించుకోవాలో ఎన్‌డీఆర్ఎఫ్, ఫైర్ సేఫ్టీ అధికారులు వివరించారు. అనంతరం ఫైర్‌సేఫ్టీ అధికారులు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీవో శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫెసిలిటేటర్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్, జూన్ 29 : ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మే డీలర్లకు ఏడాది పాటు(వారానికి ఒక రోజు) శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఏవో విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు (ఫెసిలిటేటర్స్) భూపాలపల్లి జిల్లాలో నివసిస్తూ ఉండాలని, 40 మంది డీలర్లకు పాఠాలు చెప్పాలని, వ్యవసాయ, ఉద్యానవన శాస్త్రంలో పీజీ చేసి ఉండాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఏడాది పాటు నెలకు రూ.17 వేలు గౌరవ వేతనం ఉంటుందని వివరించారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి..

భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల్లో గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ 55 శాతం, (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం) ఉత్తీర్ణ సాధించిన వారు జూలై 3లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

ఏటూరునాగారం డిగ్రీ కాలేజీలో..

ఏటూరునాగారం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, రాజనీతి శాస్త్రం, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జే చిన్న తెలిపారు. ఆసక్తిగల వారు వచ్చే నెల 2లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 986656840 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

భూపాలపల్లి డీఈవోగా రాజేందర్

భూపాలపల్లి రూరల్, జూన్ 29: జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎం రాజేందర్‌ను నియమిస్తూ శనివారం పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీశారు. ప్రస్తుత డీఈవో రాంకుమార్ జూన్ 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాజేందర్‌ను డీఈవోగా నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

పిల్లలకు ఆటపాటలతో విద్య బోధించాలి

కాటారం, జూన్ 29 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య బోధించాలని మహదేవపూర్ సీడీపీవో రాధిక అన్నారు. మండలంలోని దేవరాంపల్లి జడ్పీహెచ్ఎస్ భవనంలో మూడు రోజులుగా పలు సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు ప్రీప్రైమరీ రివైజ్డ్ సిలబస్‌పై నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. ఏడబ్ల్యూటీలకు మాస్టర్ ట్రైనర్స్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సరస్వతి, భాగ్యలక్ష్మి, వీణ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. పిల్లలకు సులభంగా ఆటపాటలు, కథలు, బొమ్మలు, చార్ట్స్ ద్వారా సృజనాత్మకతతో బోధించేలా శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు రోజున సీడీపీవో రాధిక హాజరై పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యనందించడానికి ప్రభుత్వం నూతన విధానాన్ని తెచ్చిందన్నారు. కార్యక్రమంలో పలు సెక్టార్లకు చెందిన 40 మంది అంగన్‌వాడీ టీచర్లు శిక్షణ పొందారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కావాలి

ములుగురూరల్, జూన్ 29 : రాష్ట్ర క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాలకు జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జూలై 7న హైదరాబాద్‌లోని హకీంపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కావాలని జిల్లా క్రీడల అధికారి తుల రవి అన్నారు. శనివారం జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల క్రీడా మైదానంలోవిద్యార్థులకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. రవి మాట్లాడుతూ మొత్తం 65 మంది విద్యార్థులకు ఏడు టెస్టులను నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో బాలురు 20 మంది, బాలికలు 20 మందిని జూలై 5న ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.


రామప్ప ఆలయంలో శ్రీలంక దేశస్తులు

రామప్పను సందర్శించిన శ్రీలంక దేశస్తులు

వెంకటాపూర్, జూన్ 29 : రామప్ప దేవాలయాన్ని శనివారం 30 మంది శ్రీలంక దేశస్తులు సందర్శించారు. హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న అధికారులు, జర్నలిస్టులు శిక్షణలో భాగంగా రామప్ప దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కాకతీయల చరిత్ర, ఆలయ శిల్పకళ ప్రాముఖ్యతను టూరిజం గైడ్ వారికి వివరించారు. వారి వెంట ఎంసీహెచ్ఆర్‌డీ అధికారులు సురేశ్, రవి, టూరిజం, దేవాదాయ, పురావస్తు, ఎంసీహెచ్ఆర్‌డీ సిబ్బంది ఉన్నారు.